క్లుప్తంగా

భారీ వాహనదారులు సమయపాలన పాటించాలి



జరిమానా విధిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం

సూర్యాపేటటౌన్ : పట్టణంలోకి వచ్చేందుకు భారీ వాహనదారులు సమయపాలన పాటించాలని ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం అన్నారు. జిల్లా కేంద్రంలోకి సోమవారం ఉదయం 9గంటల తర్వాత భారీ వాహనం రావడంతో ఆ వాహనానికి రూ.2,200 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. భారీ వాహనాలకు ఉదయం 9గంటల నుంచి రాత్రి 9గంటల వరకు పట్టణంలోకి అనుమతి లేదని తెలిపారు. ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

అర్వపల్లి : ఆయిల్‌పామ్ సాగుపై విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు జాజిరెడ్డిగూడెం మండల వ్యవసాయ విస్తరణ అధికారి నేరెళ్ల సత్యం, పతంజలి ఆయిల్‌పామ్ క్షేత్ర సహాయకుడు రంగు ముత్యంరాజు అన్నారు. సోమవారం మండల పరిధిలోని అడివెంల క్రాస్ రోడ్డు వద్ద ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలంటే ఆయిల్‌పామ్ తోటలను సాగుచేసి నెలనెలా ఆదాయం పొందాలని సూచించారు. ఆసక్తి గల రైతులు ఉద్యానశాఖ అధికారులకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉత్తమ రైతు బంటు యాదగిరి, వివిధ గ్రామాలకు చెందిన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పూర్వవిద్యార్థుల చేయూత



ఆర్థికసాయం చేస్తున్న మృతుడి స్నేహితులు

తుంగతుర్తి : వెలుగుపల్లి గ్రామానికి చెందిన షేక్.నబీపాష ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ సందర్భంగా మృతుడి 2004–2005 టెన్త్‌క్లాస్ బ్యాచ్ స్నేహితులు సోమవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, రూ.30,000 ఆర్థికసాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో బొల్లం లింగయ్య, ప్రభాకర్, షేక్ అజ్జు, కర్నే కరుణాకర్, చర్లపల్లి ఉప్పలయ్య, అందే రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామ పంచాయతీ ఆవాసం మర్రిబావితండాకు చెందిన భూక్యా సాయికుమార్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో మృతుడి కుటుంబానికి ఆరాధ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం క్వింటా బియ్యం, కొంత ఆర్థికసాయం అందజేశారు. సాయికుమార్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు జయపాల్‌నాయక్, మండల ఎస్టీ సెల్ అధ్యక్షుడు నాగులునాయక్, నర్సింహ, వీర్యానాయక్, రవినాయక్, సుమన్, సురేష్, ఫిరోజ్, ప్రవీన్, గిరిజనులు పాల్గొన్నారు.

నీటి సరఫరా పునరుద్ధరణ

సాక్షి ఎఫెక్ట్

అర్వపల్లి : మిషన్ భగీరథ నీళ్లు బంద్ అనే శీర్షికన సాక్షిలో సోమవారం ప్రచురితమైన కథనానికి ఆ శాఖ అధికారులు స్పందించారు. ఐదు రోజులుగా జాజిరెడ్డిగూడెం మండలానికి మిషన్ భగీరథ నీళ్లు నిలిచిపోయి ప్రజలు నీటి కోసం గ్రామాల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయమై కథనం ప్రచురించగా నీటిని పాలేరు రిజర్వాయర్ నుంచి పునరుద్ధరించారు. దీంతో మండల వ్యాప్తంగా మిషన్ భగీరథ నీళ్ల సరఫరా అయ్యాయి.

ఇసుక డంప్‌ల సీజ్

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ముక్కుడుదేవులపల్లి గ్రామ శివారులో ఇసుక డంప్‌లను సోమవారం అధికారులు సీజ్ చేశారు. సమీపంలోని ఏటి నుంచి కొందరు గుర్తు తెలియని వ్యక్తులు ఇసుకను తరలించి డంప్ చేయడంతో గ్రామస్తులు రెవెన్యూ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ సమాచారంతో రెవెన్యూ అధికారులు, పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని ఇసుకను సీజ్ చేశారు. ఇసుకను నిల్వ ఉంచిన విషయంపై విచారణ చేసి, డంప్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆర్ఐ ప్రదీప్ రెడ్డి తెలిపారు.



ఇసుక డంప్‌లను పరిశీలిస్తున్న అధికారులు

వర్షం, ఈదురు గాలులతో నష్టం



పదమటితండాలో వర్షానికి నేలకొరిగిన వరిచేలు



కాసర్లపహాడ్ సమీపంలో..

- జాజిరెడ్డిగూడెం మండలంలో 500 ఎకరాల్లో దెబ్బతిన్న వరిపొలాలు
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వేడుకోలు

అర్వపల్లి : అన్నదాతలు ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికొచ్చే వరకు నమ్మకం లేని పరిస్థితి ఏర్పడింది. వానాకాలం సీజన్‌కు సంబంధించి జాజిరెడ్డిగూడెం మండల వ్యాప్తంగా వరి పొలాలు మరో 20 రోజుల్లో చేతికందనున్నాయి. ఈ సీజన్‌లో రైతులు సుమారు 22 వేల ఎకరాల్లో వరి సాగుచేశారు. అయితే ఆదివారం సాయంత్రం కురిసిన వర్షం, ఈదురుగాలులతో పంటలు దెబ్బతిన్నాయి.

దెబ్బతిన్న వరిపైర్లు..

జాజిరెడ్డిగూడెం మండలంలో ప్రస్తుతం వరి పంటలు పొట్టదశ, చేతికొచ్చే దశలో ఉన్నాయి. ముందుగా సాగుచేసినవి వారం రోజుల్లో కోయనున్నారు. ఆలస్యంగా సాగు చేసిన వరి పొలాలు నెల రోజుల్లో కోతకు రానున్నాయి. ఈ దశలో వర్షం, ఈదురుగాలులు రావడంతో వరి పొలాలు నేలకొరిగాయి. కోత దశకు వచ్చిన పొలాల్లో వరిగింజలు రాలిపోయాయి. దీంతో అన్నదాతలు లబోదిబోమంటున్నారు. మండల వ్యాప్తంగా సుమారు 500ఎకరాలకు పైగానే వరి పంటలు దెబ్బతిన్నాయి. పొల్లాల్లో వరిచేలు ఎక్కడికక్కడ నేలకొరిగాయి. వరికోత యంత్రంతో పొలాలు కోసే పరిస్థితుల్లో కూడా లేకుండా మారాయి. దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం చెల్లించాలని రైతులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నారు.

ఎకరం పంట దెబ్బతింది



మరో 20 రోజుల్లో వరిపంట కోతకు రానుండగా వర్షం, ఈదురు గాలికి మొత్తం నేల కొరిగింది. దీంతో పంట నేల పాలైంది. సుమారు రూ. 40 వేల నష్టం వాటిల్లింది. ప్రభుత్వం నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– ధరావత్ శివాజీ, పదమటితండా

చేతికొచ్చే సమయంలో నేలపాలు



ఈసారి మూడున్నర ఎకరాల్లో వరిపంట సాగుచేశాను. మరికొద్ది రోజుల్లో పంట చేతికందనుంది. ఈ సమయంలో భారీ వర్షం, ఈదురుగాలితో పంట నేలపాలైంది. సుమారు రూ.లక్షన్నర మేర నష్ట పోయాను.

– అంగోతు గోపి, రైతు

నాలుగు ఎకరాల్లో నష్టం



నాలుగు ఎకరాల్లో వరిపంట వేశాను. 20 రోజుల్లో వరి పంట చేతికొచ్చే అవకాశం ఉండగా వర్షం, గాలికి వరిచేను మొత్తం నేలవారి గింజలు రాలిపోయాయి. జరిగిన నష్టంపై వ్యవసాయ అధికారులకు తెలియజేశాను. నష్టపరిహారం చెల్లించి ఆదుకోవాలి.

– రాము, రైతు

ఇంటిగ్రేటెడ్ స్కూల్ శంకుస్థాపన ఆపాలని వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

తుంగతుర్తి : తిరుమలగిరి మండలం తొండ గ్రామంలో ఈ నెల 11న చేపట్టే ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ శంకుస్థాపన కార్యక్రమాన్ని నిలిపివేయాలని కోరుతూ సోమవారం బీఆర్ఎస్ నాయకులు కలెక్టరేట్‌లో కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు తడకమళ్ల రవికుమార్ మాట్లాడారు. తుంగతుర్తి నియోజకవర్గ కేంద్రం విద్య, వైద్యం, రవాణా రంగాల్లో వెనకబాటుకి గురైందని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా తుంగతుర్తి తలరాత మారడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను తుంగతుర్తి మండలంలో ఏర్పాటు చేయాలన్నారు. తుంగతుర్తి మండల పరిధిలోని కరివిరాల కొత్తగూడెంలో 365 జాతీయ రహదారి వెంబడి 20 నుంచి 30 ఎకరాల ప్రభుత్వ భూమి ఉందని తెలిపారు. కార్యక్రమంలో బొంకూరు మల్లేష్, కొండగడుపుల వెంకటేష్, తడకమళ్ల మల్లిఖార్జున్, చింతకుంట్ల సురేష్, కొండగడుపుల శ్రీను పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణపై కళాజాతా



కళాజాతాలో మాట్లాడుతున్న హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య

మద్దిరాల : ప్రజలు సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని హెడ్ కానిస్టేబుల్ మల్లయ్య అన్నారు. సైబర్ నేరాలు, గంజాయి, మత్తు పదార్థాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై సోమవారం కుక్కడం గ్రామంలో ఏర్పాటు చేసిన కళాజాతా కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సైబర్ మోసాలకు గురికావొద్దని అన్నారు. బ్యాంక్ ఖాతా, ఏటీఎం కార్డు, ఓటీపీ వివరాలను ఇతరులకు తెలపవద్దని సూచించారు. మెసేజ్‌లలో వచ్చే బ్లూ లింకులను అనుసరించి వ్యక్తిగత వివరాలను నమోదు చేయవద్దని అన్నారు. ఒకవేళ సైబర్ మోసాలకు గురైనట్లు అనుమానం వస్తే వెంటనే 1930 నంబర్‌కు డయల్ చేయాలని సూచించారు. యువత గంజాయి, మత్తు పదార్థాలు, మద్యానికి బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని అన్నారు. రోడ్డు ప్రమాదాలు జరుగకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని వివరించారు. ఈ కార్యక్రమంలో హోంగార్డు వెంకన్న, కళాబృందం ఇన్‌చార్జ్ ఎల్లయ్య, గోపయ్య, గురులింగం, క్రిష్ణా, చారి, నాగార్జున్, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే కమీషన్ ఇవ్వాలి



వినతిపత్రం అందజేస్తున్న ఎల్ఐసీ ఏజెంట్లు

సూర్యాపేట : ఎల్ఐసీ ఏజెంట్ల కమీషన్ పాత పద్ధతిలోనే ఇవ్వాలని సోమవారం సూర్యాపేట బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో ఏజెంట్లు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏజెంట్స్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా జిల్లా కన్వీనర్ మార్కాల వెంకటరెడ్డి మాట్లాడారు. కొత్త పద్ధతిని రద్దు చేయాలని, పాత పాలసీలను కొనసాగించాలని డిమాండ్ చేశారు. ఏజెంట్లను, ఎల్ఐసీని నష్టపరిచే ఐఆర్‌డీఏ ప్రతిపాదనలను వెనక్కి తీసుకోవాలని అన్నారు. ప్రీమియంపై జీఎస్టీని రద్దు చేయాలని అన్నారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఎల్ఐసీ సీనియర్ బ్రాంచ్ మేనేజర్‌కు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు చిల్లంచర్ల కృష్ణయ్య, సారెడ్డి వెంకటరెడ్డి, గౌరవ సలహాదారు చెరుకు సత్యం, ఉపాధ్యక్షుడు సల్వాది మల్లయ్య, కమిటీ సభ్యులు కుంచం రాములు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సమీక్ష



తిరుమలగిరిలో మాట్లాడుతున్న తహసీల్దార్



నాగారంలో..

తిరుమలగిరి : వానాకాలం సీజన్‌లో ఐకేపీ, పీఏసీఎస్ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ హరిప్రసాద్ మాట్లాడారు. వరిధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు ఆయా గ్రామాల్లో స్థలాలు చూడాలని చెప్పారు. ఈ సీజన్‌లో దొడ్డు, సన్నరకం ధాన్యానికి వేర్వేరుగా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మండల టీమ్ ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ లాజర్, ఎస్ఐ సురేష్, మండల వ్యవసాయ అధికారి నాగేశ్వరరావు, ఏపీఎం సైదయ్య, పీఏసీఎస్ సీఈఓ విజయ్ కృష్ణారెడ్డి, మెప్మా సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

నాగారం : ఐకేపీ కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని తహసీల్దార్ వి.బ్రహ్మయ్య అన్నారు. 2024–25 వానాకాలం వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటుపై సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, ఐకేపీ నిర్వాహకులతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొని మాట్లాడారు. మండలంలో 21ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. వీటిలో మూడు కేంద్రాలు సన్నరకం ధాన్యం కొనుగోళ్లకు కేటాయించినట్లు తెలిపారు. రైతులు ధాన్యాన్ని తూర్పార పట్టి, 17శాతంలోపు తేమ ఉండేలా కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి మద్దతు ధరను పొందాలన్నారు. పీఏసీఎస్, ఐకేపీ నిర్వాహకులు తూకాలు సక్రమంగా నిర్వహించాలని, విద్యుత్ సౌకర్యం, ప్యాడీ క్లీనర్ల కొరత లేకుండా చూడాలన్నారు. ఐకేపీల వద్ద రైతులకు తాగునీరు, షామియానాలు తదితర మౌలిక వసతులు కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ ధార శ్రీనివాస్, ఏఓ కృష్ణకాంత్, డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఏపీఎం శోభారాణి, పోలీసు సిబ్బంది, సీసీలు, వీఓలు, ఐకేపీ, పీఏసీఎస్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

బూటకపు ఎన్‌కౌంటర్లకు పాల్పడడం తగదు

- ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య



మాట్లాడుతున్న గంటా నాగయ్య

భానుపురి : ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం దంతెవాడ అటవీ ప్రాంతంలో కేంద్ర ప్రభుత్వం, పోలీసు యంత్రాంగం బూటకపు ఎన్‌కౌంటర్‌కు పాల్పడి మావోయిస్టులను కాల్చి చంపడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య పేర్కొన్నారు. సోమవారం సూర్యాపేట పట్టణంలోని చంద్రా పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన ప్రజాసంఘాల కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను నిర్మూలించాలనే విధానం దుర్మార్గమైందన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలను మోదీ ప్రభుత్వం అదానీ, అంబానీలకు అంటగడుతోందని, అందులో భాగంగానే ఛత్తీస్‌గఢ్ అటవీ ప్రాంతంలో ఉన్న సహజ వనరులను వారికి అప్పజెప్పడానికి కుట్ర పన్నిందన్నారు. అందుకే మారణ హోమాన్ని సృష్టిస్తుందని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో న్యాయ విచారణ జరిపి, ఎన్‌కౌంటర్‌లో పాల్గొన్న పోలీసులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా సహాయ కార్యదర్శి దేసోజు మధు, జిల్లా కమిటీ సభ్యుడు సామ నర్సిరెడ్డి, అరుణోదయ జిల్లా కమిటీ సభ్యులు బొల్కా పవన్, దుర్గయ్య, మందడి శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలి



మాట్లాడుతున్న ధనుంజయ నాయుడు

భానుపురి : రజకులను ఎస్సీ జాబితాలో చేర్చడానికి శాఖపరమైన అన్ని చర్యలు చేపట్టాలని బీసీ హక్కుల సాధన సమితి తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ధూళిపాల ధనుంజయ నాయుడు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సోమవారం పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన తెలంగాణ రజక వృత్తిదారుల సమాఖ్య సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రజక ఫెడరేషన్‌కు వెంటనే పాలకమండలి ఏర్పాటు చేసి, జనాభా ప్రాతిపదికన నిధులు కేటాయించాలన్నారు. 50ఏళ్లు నిండిన ప్రతి రజక వృత్తిదారుడికి నెలకు రూ.5వేల పెన్షన్ మంజూరు చేయాలని, ధోబీ ఘాట్ల పరిరక్షణ, మౌలిక వసతుల కల్పనకు నూతన కేటాయింపులు జరపాలని డిమాండ్ చేశారు. అనంతరం రజక సమాఖ్య జిల్లా కన్వీనర్‌గా ఖమ్మంపాటి రాము, కోకన్వీనర్లుగా చిలక రాజు, శ్రీనులను ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా వెంకన్న, వెంకట్, నాగమ్మలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు, రజక వృత్తిదారుల సమాఖ్య నాయకులు నిమ్మల శ్రీనివాస్, చెరుకు సింహాద్రి, యాదగిరి, పట్టణ సీపీఐ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, బాదె నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

పేదల కోసం పోరాడేది కమ్యూనిస్టులే..



మాట్లాడుతున్న యాదగిరిరావు

తుంగతుర్తి : పేదల ప్రజల కోసం నిత్యం పోరాడేది కమ్యూనిస్టులే అని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో జరిగిన సీపీఎం తుంగతుర్తి గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. దేశంలో ఎక్కువ మంది పేద, మధ్యతరగతి వర్గాలకు చెందినవారే ఉన్నారని, వారికి ఉద్యోగ భద్రత, పని భద్రత లేకపోవడంతో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు వచ్చినా ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాలు అమలు చేయడం లేదన్నారు. ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై సీపీఎం పోరాటాలు చేస్తుందని తెలిపారు. అనంతరం సీపీఎం పట్టణ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పట్టణ కార్యదర్శిగా ఉప్పుల సోమయ్యతోపాటు మరికొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్, ఓరుగంటి అంతయ్య, కందాల శంకర్‌రెడ్డి, ఉప్పలయ్య, తాటి విజయమ్మ, గడ్డం ఎల్లయ్య, సోమయ్య, మల్లయ్య, మల్సూరు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఇసుక నూతన విధానంపై అవగాహన

నాగారం : రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా ప్రవేశపెట్టిన 'మన ఇసుక వాహనం' పథకానికి సంబంధించి ట్రాక్టర్ యజమానులు తమ ట్రాక్టర్లను రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని తహసీల్దార్ బ్రహ్మయ్య అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో నూతన ఇసుక విధానంపై ట్రాక్టర్ యజమానులకు అవగాహన కల్పించి మాట్లాడారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారి పేర్లను క్రమ సంఖ్య ప్రకారం రికార్డు చేయనున్నట్లు చెప్పారు. రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన పత్రాలను, రూ.20 వేల డీడీని కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. ఈ సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ షాహిన్‌బేగం, ఆర్ఐ నాగరాజు, రెవెన్యూ సిబ్బంది, ట్రాక్టర్ల యజమానులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

అర్వపల్లి : ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారుల జిల్లా బాధ్యుడు ఈర్ల సైదులు కోరారు. సోమవారం నాణ్యతండాలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల నిషేదం, గంజాయి నియంత్రణ, పారిశుద్ధ్యం, ఆరోగ్యం, ప్రభుత్వ పథకాలపై కళాప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో వెన్నెల నాగరాజు, మాగి శంకర్, గడ్డం ఉదయ్, పాలకుర్తి శ్రీకాంత్, వేణు, పాక ఉపేందర్, మంజుల, రాధ, స్రవంతి, శిరీష పాల్గొన్నారు.

మహాచండీ దేవి అవతారంలో దుర్గామాత

దేవీ శరన్నవరాత్రోత్సవాలు కొనసాగుతున్నాయి. సోమవారం దుర్గామాత మహాచండీ దేవి రూపంలో దర్శనమిచ్చింది. ఆయా గ్రామాల్లో మండపాల వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలుచోట్ల అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



సూర్యాపేట 28వ వార్డులో దుర్గామాత పూజలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్డీఆర్, తదితరులు



సూర్యాపేట టౌన్ : మహాచండీ దేవిగా సంతోషిమాత..



నాగారం : వర్ధమానుకోటలో..



మద్దిరాల : మామిండ్లమడవ గ్రామంలో..



సూర్యాపేట టౌన్ : శ్రీసంతోషిమాత ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



తుంగతుర్తిలో దుర్గామాత వద్ద పూజలు చేస్తున్న భక్తులు



తిరుమలగిరిలో కుంకుమ పూజలో పాల్గొన్న భక్తులు



సూర్యాపేట టౌన్ : 43వ వార్డులో అన్నదానం..

పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో కబడ్డీ పోటీలు



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న ఎస్ఐ

అర్వపల్లి : క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని అర్వపల్లి ఎస్ఐ బాలకృష్ణ అన్నారు. జాజిరెడ్డిగూడెంలో సోమవారం పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో ఉమ్మడి మండల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ఎల్లంల కొమిరెల్లి, బింగి కృష్ణమూర్తి, సుతారపు అనిల్‌కుమార్, చింత నర్సయ్య, అక్కులు, దాసరి సోమయ్య, నర్సింగ వెంకటేశ్వర్లు, వీరయ్య, కృష్ణమూర్తి, సత్యనారాయణ, నాగరాజు, ఉప్పు సోమయ్య, గణేష్, నరేష్, నవీన్, లోకేష్, సాయి, పీడీలు సోమయ్య, మల్లేష్, సైదులు పాల్గొన్నారు.

పూలమ్మ మృతి తీరనిలోటు

మద్దిరాల : బద్దం పూలమ్మ మృతి సీపీఎంకు తీరనిలోటని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి అన్నారు. గోరెంట్లకు చెందిన బద్దం పూలమ్మ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందారు. దీంతో నాగార్జున్‌రెడ్డి ఆమె మృతదేహాన్ని సందర్శించి పూలమాల వేసి నివాళులర్పించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, కోట గోపి, కందాల శంకర్‌రెడ్డి, కల్లెపల్లి భాస్కర్, కన్న వీరన్న, పోలోజు సైదులు, దీకొండ ఉపేందర్, బత్తుల మల్లారెడ్డి, రంగయ్య, లింగయ్య, చంద్రయ్య, సత్యం పాల్గొన్నారు.